# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | గురువారం - 26 - ఫిబ్రవరి - 2026 | సంపుటి : 3 | సంచిక : 269 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


### గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏఐపై

# సీఎం రేవంత్ సమీక్ష

**శంతనునారాయణ్‌తో ఉన్నత స్థాయి భేటీ.. తెలంగాణ రైజింగ్-2047 విజన్ దిశగా చర్చ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఏఐ ప్రభావం, యువతకు స్కిల్లింగ్-రీస్కిల్లింగ్ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అడోబ్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి, తెలంగాణ రైజింగ్2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచవ్యాప్తంగా మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో జరుగుతున్న మార్పులు, గ్రీన్ ఎనర్జీ వైపు దేశాలు తీసుకుంటున్న అడుగులు, ఏఐ విప్లవం ఆర్థిక వ్యవస్థపై చూపిస్తున్న ప్రభావం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో తీసుకోవాల్సిన విధాన నిర్ణయాలపై సమావేశంలో సమగ్ర సమీక్ష జరిగింది. తెలంగాణను శక్తివంతమైన తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించేందుకు



విధానాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణ వాతావరణం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుస్థిర పారిశ్రామిక వృద్ధి దిశగా వ్యూహాత్మక చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఏఐలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఉద్యోగావకాశాల స్వరూపాన్ని మార్చుతున్న నేపథ్యంలో యువతను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయడం అత్యవసరమని ముఖ్యమంత్రి అన్నారు. స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాలను బలోపేతం చేసి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి యాత్రను వేగవంతం చేసేందుకు సాంకేతిక, తయారీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో మరింత సహకారం అందించాలని శంతను నారాయణ్‌ను ముఖ్యమంత్రి కోరారు.

### రాష్ట్రవ్యాప్తంగా

# రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

## అద్దె భవనాలకు చెక్

**తొలి దశలో 65 కార్యాలయాలకు నిర్మాణం**

**ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఉప విభాగాధికారి కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు.

మిగతా 2లో..

### యూట్యూబర్ అన్వేష్‌పై

# లుకౌట్ నోటీసులు

- భక్తుల మనోభావాలు దెబ్బతీశాడంటూ కేసు
- పంజాగుట్ట పోలీసుల చర్యలు
- సామాజిక మాధ్యమ ఖాతాలపై కూడా చర్యల యత్నం

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

'నా అన్వేషణ' పేరుతో యూట్యూబ్ నిర్వహిస్తున్న అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వీడియో విడుదల చేశాడంటూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. విశాఖపట్నంకు చెందిన అన్వేష్ ప్రస్తుతం విదేశాల్లో ఉంటూ తన యూట్యూబ్ వేదిక ద్వారా వీడియోలు విడుదల చేస్తున్నాడు. ఇటీవల విడుదల చేసిన వీడియోపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సినీ నటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.


మిగతా 2లో..



### ఆటో కార్మికులకు హరీష్ రావు

# ఆత్మీయ భరోసా

- సిద్దిపేట ఆటో కోఆపరేటివ్ సంఘం ద్వారా ఆర్థిక సహాయం
- 18 కుటుంబాలకు రూ.36 లక్షల భీమా చెల్లింపు
- ఇటీవల రెండు కుటుంబాలకు రూ.4 లక్షల చెక్కుల అందజేత




**సిద్దిపేట, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేటలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఏర్పాటు చేసిన ఆటో కోఆపరేటివ్ సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తోంది. సిద్దిపేట అభివృద్ధికి ఆటో కార్మికులే బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొంటూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆటో కార్మికులకు భరోసా కల్పించేందుకు హరీష్ రావు తన స్వంత ఇంటి స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి సంఘం ఏర్పాటుకు ముందుకొచ్చారు. ప్రమాదవశాత్తు మరణించిన ఆటో కార్మికుల కుటుంబాలకు నాలుగు లక్షలు, సహజ మరణం చెందిన వారికి భీమా అందే విధంగా పథకం రూపొందించారు. ఇప్పటివరకు 18 మంది మరణించిన కార్మికుల కుటుంబాలకు రెండు లక్షల చొప్పున మొత్తం రూ.36 లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు.


మిగతా 2లో..



## ఎఫ్‌టీఎల్ హద్దుల్లో మార్పులు ఉండవు

- సున్నం చెరువు వివాదంపై ఎమ్మెల్యే విమర్శలకు ఖండన
- ప్రభుత్వ భూమి ఉంటే స్వాధీనం చేసుకుంటామని వెల్లడి
- పర్యావరణహిత నగర నిర్మాణమే లక్ష్యమని స్పష్టం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

2లో



### ప్రపంచ స్థాయి సౌకర్యాలతో

# కరీంనగర్ రైల్వే స్టేషన్

- అత్యాధునిక సదుపాయాలతో పునరాభివృద్ధి పూర్తి
- రూ.25.85 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ప్రయాణికులకు మెరుగైన అనుభవం

**కరీంనగర్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలోని కరీంనగర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రపంచ స్థాయి అత్యాధునిక సౌకర్యాలతో స్టేషన్ రూపు సంతరించుకుని ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తోంది. మొత్తం రూ.25.85 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు శాతం 100 పూర్తి అయింది. స్టేషన్ భవనాన్ని ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయడంతో పాటు విస్తృతమైన వేచివుండే గదులు, శుభ్రమైన మరుగుదొడ్లు, మెరుగైన తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రాకపోకలకు సులభతరం చేసే విధంగా ప్లాట్‌ఫారమ్‌లను విస్తరించారు. అదేవిధంగా డిజిటల్ సూచిక బోర్డులు, సీసీ కెమెరా పర్యవేక్షణ, ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం సౌకర్యాలు కల్పించారు. భద్రత, పరిశుభ్రత, సౌకర్యాల పరంగా స్టేషన్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దారు. ఈ పునరాభివృద్ధితో కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రాంతీయ రవాణా కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందనుంది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమివ్వనుందని అధికారులు భావిస్తున్నారు.



### గ్రేటర్ హైదరాబాద్‌లో

# ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం

**ఉగాది లోపు మంజూరు పత్రాల పంపిణీ లక్ష్యం**

**సొంత స్థలం ఉన్న పేదలకు తొలి ప్రాధాన్యం**

**మోడల్ కాలనీలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

నగరంలోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉగాది పండుగలోపు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల నుంచి భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. సుమారు 12 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలనలో 18 వేల మందిని అర్హులుగా గుర్తించారు. ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పత్రాలు, కుటుంబ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను వారం రోజుల్లో ఖరారు చేయాలని భావిస్తున్నారు. సొంత స్థలం ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేదలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇలాంటి లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించనుంది. అదేవిధంగా మురికివాడల్లో నివసించే వారి కోసం ఇందిరమ్మ మోడల్ కాలనీలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## రాష్ట్రవ్యాప్తంగా
# రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరికాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మొదటి దశలో ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఉప విభాగాధికారి కార్యాలయాలకు సకల వసతులతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. రెండో దశలో శిథిలావస్థలో ఉన్న 170 కార్యాలయాలను పునర్నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాలు ఒకే నమూనాలో, ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా రూపకల్పన చేయాలని చర్చించారు. స్టాంపులు మరియు నమోదు శాఖలో ఆధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పఠాన్ చెరువు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, గచ్చిబౌలి భవనం తుది దశలో ఉందని వెల్లడించారు.
గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా మండలాలు విభజించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొత్త మండలాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించి సేవలను బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ఎఫ్‌టీఎల్ హద్దుల్లో మార్పులు ఉండవు



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** సున్నం చెరువుతో పాటు ఇతర చెరువుల ఎఫ్‌టీఎల్ పరిమితులు ఒకసారి నిర్ణయించిన తర్వాత వాటిలో ఎలాంటి మార్పులు, చేర్పులు ఉండవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిమితిని 2014లోనే ఖరారు చేశారని, అదే మేరకు ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. కొందరికి లబ్ధి చేకూర్చేందుకు ఐదు ఎకరాల వరకు మినహాయింపులు ఇస్తున్నారన్న ఆరోపణలు అసత్యమని పేర్కొన్నారు. చెరువు పరిధికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమికి గతంలో ఫెన్సింగ్ వేసి ఉండవచ్చని, అది ఎఫ్‌టీఎల్ పరిమితికి సంబంధం లేదని వివరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారమే చెరువు హద్దుల్లో పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. చెరువు చెంత ప్రభుత్వ భూమి ఉంటే తప్పకుండా స్వాధీనం చేసుకుని పార్కులు, పిల్లల ఆట స్థలాలు, ప్రజావసరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మాధాపూర్ తమ్మిడి కుంటతో పాటు మొదటి విడతలో అభివృద్ధి చేసిన ఆరు చెరువుల వద్ద కూడా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో భూముల విలువ అధికంగా ఉండడం వల్లే ఆక్రమణల ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. హైడ్రాకు వచ్చే ఫిర్యాదుల్లో 40 శాతం కూకట్‌పల్లి జోన్ నుంచే వస్తున్నాయని వెల్లడించారు.
ఇప్పటివరకు 1240 చోట్ల ఆక్రమణలను తొలగించి 1310 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించామని కమిషనర్ తెలిపారు. ఇందులో పెద్ద స్థాయి వ్యక్తుల ఆక్రమణలే అధికంగా ఉన్నాయని చెప్పారు. హైడ్రా రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోందని, చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసర స్థలాలు, ప్రభుత్వ భూములను కాపాడి పర్యావరణహిత నగర నిర్మాణం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.
కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామంలో స్వాధీనం చేసుకున్న దాదాపు 300 ఎకరాల భూమిని ప్రభుత్వం వివిధ శాఖలకు కేటాయించిందని, అక్కడ సామాజిక సంక్షేమ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. అలాగే శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో రక్షించిన ఏడు ఎకరాల భూమిని విద్యాసంస్థలు, పార్కుల అభివృద్ధికి వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరికీ ఉపయోగపడేలా ప్రభుత్వ నిర్ణయాల అమలు దిశగా హైడ్రా పని చేస్తుందని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

# హంతకులను అరెస్ట్ చేయాలి: కేటీఆర్

- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ
- పది లక్షలతో ఇల్లు నిర్మాణం.. తక్షణ సహాయంగా లక్ష రూపాయలు
- హత్యానేరం కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దారుణ ఘటనలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, పది లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని ప్రకటించారు. తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న వివిధ వర్గాల నాయకులు, కార్యకర్తలను కలిసి సంఘీభావం తెలిపారు. కుమ్మెరలో జరిగిన ఈ ఘటన తెలంగాణ సమాజం మొత్తం తలదించుకునేలా చేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాప హంతకులకు అండగా నిలబడే ప్రతి ఒక్కరూ దోషులేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అయినా, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎవరైనా సరే హంతకులకు మద్దతు ఇవ్వడం పూర్తిగా తప్పని కేటీఆర్ అన్నారు. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి జైల్లో వేయాలని, అవసరమైతే ఉరిశిక్ష విధించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- ప్రతి మహిళకు 2,500 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్
- కరీంనగర్ కలెక్టరేట్ ముందు తెలంగాణ జాగృతి ధర్నా
- మిగతా హామీలను కూడా నెరవేర్చాలని విజ్ఞప్తి




**కరీంనగర్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు నెలకు 2,500 రూపాయల నగదు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళల సంక్షేమం కోసం పలు హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ వాటి అమలులో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. మహిళల ఆర్థిక భద్రత కోసం 2,500 రూపాయల సహాయం కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా గ్యాస్, ఉపాధి, విద్య, స్వయం సహాయక బృందాలకు సంబంధించిన హామీలను కూడా పూర్తిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళల అభ్యున్నతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆందోళనకారులు విజ్ఞప్తి చేశారు. ధర్నాలో తెలంగాణ జాగృతి నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## ఆటో కార్మికులకు హరీష్ రావు
# ఆత్మీయ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సడిమేల రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి గ్రామానికి చెందిన గ్యాదపాక రమేష్ మరణించారు. ఈ రెండు కుటుంబాలకు రెండు లక్షల చొప్పున మొత్తం నాలుగు లక్షల రూపాయల చెక్కులను హరీష్ రావు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయిన వారికి ధైర్యం చెప్పి, పిల్లల చదువుల బాధ్యతను తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న నాయకుడిగా హరీష్ రావు నిలుస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు.



## యూట్యూబర్ అన్వేష్‌పై
# లుకౌట్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు భాగంగా పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో అన్వేష్ సామాజిక మాధ్యమ ఖాతాపై కూడా చర్యలు తీసుకున్నారు. ఆయన ఖాతాను ఇటీవల ఒక ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక నిలిపివేసినట్లు సమాచారం. అయితే తనకు పెద్దగా నష్టం లేదని, యూట్యూబ్ ద్వారా ఆదాయం కొనసాగుతుందని అన్వేష్ పేర్కొన్నట్లు తెలిసింది.
అన్వేష్ నిర్వహిస్తున్న మరో ఖాతాతో పాటు యూట్యూబ్ వేదికపై కూడా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంస్థలకు పోలీసులు లేఖ రాయనున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది.

## గ్రేటర్ హైదరాబాద్‌లో
# ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

జీవనోపాధి దెబ్బతినకుండా వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఐదు నుంచి పది అంతస్తుల భవనాలు నిర్మించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నగరంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మూడు లక్షల ఇళ్లను మంజూరు చేయగా, రెండున్నర లక్షల మంది నిర్మాణ పనులు ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

- మణికొండలో విషాదం
- బ్రేకప్ అనంతరం మళ్లీ కలిసిన మాజీ స్నేహితుడు
- మనస్తాపంతో తీసుకున్న తీవ్ర నిర్ణయం?

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** మణికొండలోని చిత్రపురి కాలనీలో నివసిస్తున్న యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం ప్రకారం, కోమలి మాజీ స్నేహితుడు అఖిల్ రెడ్డి ఆత్మహత్యకు ముందు ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఏడాది క్రితం ఇద్దరూ విడిపోయినప్పటికీ, అతడిని వదిలి ఉండలేక కోమలి తిరిగి సంప్రదించి ఇంటికి పిలిచినట్లు సమాచారం. తనతో కలిసి ఉండాలని కోరగా, అఖిల్ నిరాకరించి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత కోమలి తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వ్యక్తిగత సమస్యలు జీవితాన్ని ముగించుకునే స్థాయికి తీసుకెళ్లకూడదని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడటం, అవసరమైతే నిపుణుల సహాయం పొందడం ద్వారా సమస్యలకు పరిష్కారం వెతకాలని సూచిస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎల్లంపేట మున్సిపాలిటీ ప్రతినిధులు ఎంపీ ఈటలను మర్యాదపూర్వకంగా కలిసారు

మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)

మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి షామీర్‌పేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.సమావేశంలో ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ వంటి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ ప్రజలు నమ్మకంతో గెలిపించిన నేపథ్యంలో ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని, సమయానికి పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను తీసుకురావడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు



సాగుతామని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.ఈ సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసింది.

# ఫిబ్రవరి 27న దిశ సమావేశం నిర్వహణ


- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -25 (తెలంగాణ ముచ్చట్లు)



ఫిబ్రవరి 27న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరి 27న జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించు దిశ సమావేశానికి గౌరవ సభ్యులు అందరూ హాజరు కావాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# పీచర గ్రామంలో హామీల అమలు సర్పంచ్ మరిజె అనిత నర్సింహారావు

వేలేరు, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన పోచవ్వ-రమేష్‌ల కుమార్తె మమత వివాహం సోడాషాపల్లి ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీచర గ్రామ సర్పంచ్ మరిజె అనిత నర్సింహారావు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

ఎన్నికల వేళ గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ వివాహానికి రూ. 5,116 ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించిన ఆమె, మమత వివాహ సందర్భంగా ఆ మొత్తాన్ని అందజేశారు. ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తుండటంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డు సభ్యులు కొలిపాక వెంకటేష్, ఉప్పుల శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.





# కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్ష–కార్యదర్శులుగా మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్

కాప్రా, ఫిబ్రవరి 25 ( తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా నిర్వహించారు.సమావేశంలో సభ్యుల సమక్షంలో కమిటీని ప్రకటించారు.సలహాదారులుగా ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్‌లను ఎన్నుకోగా, అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు బాధ్యతలు స్వీకరించారు. సంయుక్త కార్యదర్శులుగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుదంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ సభ్యుల ఐక్యతతో ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కోశాధికారి రామచంద్రమూర్తి పారదర్శక ఆర్థిక నిర్వహణకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.నూతన కమిటీకి అభినందనలు నూతన కమిటీకి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారితో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.



# కీసరలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- 339 మంది విద్యార్థులు హాజరు

కీసర, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమయ్యాయి. కీసరలోని శ్రద్ధ కళాశాల పరీక్షా కేంద్రంలో మొదటి రోజు 339 మంది విద్యార్థులు హాజరయ్యారు.పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి, హాల్ టికెట్ మరియు గుర్తింపు కార్డులు పరిశీలించిన అనంతరం మాత్రమే లోపలికి అనుమతించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.పరీక్షలు ఉదయం సమయానికి ప్రారంభం కాగా, 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ ముగిసేలోపు చివరి నిమిషంలో కేంద్రానికి చేరుకున్న కొందరు విద్యార్థులు కంగారుపడుతూ హాళ్లకు చేరుకున్నారు. కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు.

# డిఫాల్ట్ రైస్ మిల్లులపై క్రిమినల్ కేసుల నమోదు...

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి -25(తెలంగాణ ముచ్చట్లు)

ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ (సిఎంఆర్)లో ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా డిఫాల్ట్ చేసిన రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం రూరల్ మండలం మంగలగూడెం గ్రామంలోని శ్రీ సత్యనారాయణ సిల్కీ సార్టెక్స్ రైస్ మిల్ యాజమాన్యం 2021-22 ఖరీఫ్, 2022-23 ఖరీఫ్, రబీ, 2023-24 ఖరీఫ్ సీజన్లలో ప్రభుత్వానికి బియ్యం అందజేయడంలో విఫలమై 9.49 కోట్ల రూపాయలు అసలు బకాయి కలిగి ఉండగా, పెనాల్టీలతో కలిపి 13.84 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మిల్లు మేనేజింగ్ భాగస్వామి కన్నేటి జ్యోతి, భాగస్వామి మామిడాల మానసపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్. నెం. 129/2026 నమోదు చేయబడిందని అన్నారు.



అలాగే నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలోని వెంకటేశ్వర రైస్ మిల్ 2022-23 ఖరీఫ్, రబీ సీజన్లలో 7.59 కోట్ల అసలు బకాయి కలిగి ఉండగా, పెనాల్టీలతో కలిపి 10.88 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మిల్లు యజమాని మేకల రామారావుపై నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్. నెం. 47/2026 నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ధాన్యం, నిధుల పరిరక్షణలో రాజీపడబోమని, డిఫాల్ట్ చేసే మిల్లర్ల పై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. బకాయిల వసూలు చర్యలు వేగవంతం చేయడంతో పాటు సంబంధిత శాఖల ద్వారా తదుపరి విచారణ కొనసాగుతున్నదని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.



# పిల్లల ఆహారంలో నిర్లక్ష్యం అస్సలు వద్దు

- మోజర్ల గ్రామ సర్పంచ్ కె. చంద్రశేఖర్

పెద్దమందడి,ఫిబ్రవరి25 (తెలంగాణ ముచ్చట్లు):



పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాలను మోజర్ల గ్రామ సర్పంచ్ కె. చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలు తీసుకుంటున్న ఆహారం నాణ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు.పిల్లల ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని వంట సిబ్బందిని హెచ్చరించారు. శుభ్రత, నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.అదే విధంగా రోజువారీ భోజన మెనూను పరిశీలించిన సర్పంచ్, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గుడ్లు, పాలు వంటి పోషకాహార పదార్థాలు ప్రతి చిన్నారికి అందేలా చూడాలని అంగన్వాడీ టీచర్లకు ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి విషయంలో రాజీ ఉండబోదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.






# చర్లపల్లి పీఏసీలో ఆయుర్వేద గ్రామం పునఃప్రారంభం

- ఖైదీలకు వెల్‌నెస్, థెరపీ శిక్షణ
- కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్ ప్రారంభం

చర్లపల్లి, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

ఖైదీల సంక్షేమం, పునరావాసానికి తోడ్పడే దిశగా చర్లపల్లి ఖైదీల వ్యవసాయ కాలనీ (పీఏసీ)లో ఆయుర్వేద గ్రామం మరియు కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా బుధవారం ప్రారంభించారు. ఆరు సంవత్సరాల విరామం అనంతరం ఆయుర్వేద గ్రామాన్ని తిరిగి ప్రారంభించడం ప్రత్యేకత సంతరించుకుంది.ఈ సందర్భంగా డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, ఆయుర్వేద గ్రామం ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆయుర్వేద చికిత్సలు అందించడమే కాకుండా ఖైదీలకు వెల్‌నెస్, థెరపీ సేవలపై సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఖైదీలు విడుదల అనంతరం స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు.జైలు శాఖలో తొలిసారిగా ఏర్పాటు చేసిన కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్‌లో సంప్రదాయ పద్ధతిలో రసాయనాలు లేకుండా నూనెల తయారీ చేపట్టనున్నారు. ఈ యూనిట్ ద్వారా తయారీ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, నాణ్యత నియంత్రణ వంటి అంశాల్లో ఖైదీలకు ప్రాయోగిక శిక్షణ ఇవ్వనున్నారు .ఈ రెండు కేంద్రాల ప్రారంభంతో ఖైదీల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జైలు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో డీఐజీలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.ఎం. ఖాలిద్ అక్తర్, సూపరింటెండెంట్లు డి. భారత్, జి. ప్రమోద్, ఆయుర్వేద వైద్యులు, జైలు అధికారులు పాల్గొన్నారు.

# బాబా నగర్‌లో డ్రైనేజీ సమస్యలపై పర్యటించిన సాయిజెన్ శేఖర్

నాచారం, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ డివిజన్ పరిధిలోని బాబా నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ పర్యటించారు. చాలా కాలంగా డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించకుండానే కొత్త సిమెంట్ రోడ్లు వేశారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సమస్య ఉన్న వీధుల్లో కాలనీ వాసులతో కలిసి పరిశీలించిన సాయిజెన్ శేఖర్, డ్రైనేజీ లైన్లను మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీప్ క్లీనింగ్ చేసి సిల్ట్ పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అడ్డంకులు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ విషయమై సంబంధిత డీజీఎం వేణుగోపాల్‌కు ఫోన్ ద్వారా తెలియజేసినట్లు పేర్కొన్నారు.



డీప్ క్లీనింగ్ చేసినా సమస్య కొనసాగితే అదనంగా ఒక అడుగు డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయడానికి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాబా నగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## గ్రామ పాఠశాల అభివృద్ధికి సర్పంచు ముందడుగు

◆ సర్పంచ్ ఆధ్వర్యంలో పాఠశాల పనుల ప్రారంభం

పెద్దమందడి,ఫిబ్రవరి25 (తెలంగాణ ముచ్చట్లు):

పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వేదిక నిర్మాణం మరియు బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి .ఈ సందర్భంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ పాఠశాల అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోతుల రామిరెడ్డి, గొంది ప్రతాపరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సుంచరమోని వెంకయ్య, ఎం. రామ్ రెడ్డి, ఎం. శ్రీకాంత్ రెడ్డి, బీకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కన్నారం గ్రామంలో అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న పోలీసులు – ట్రాక్టర్ స్వాధీనం

వేలేరు, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

వేలేరు మండలం కన్నారం గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని మరియు వ్యక్తిని వేలేరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా చెవుల లింగయ్య (35)అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా గుర్తించారు.

ఈ సందర్భంగా TS 01 UC5843 నంబర్ గల ఇసుక లోడుతో వున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు.

అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



## ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా పరిశీలించారు.శామీర్‌పేట్ మండలంలోని తూంకుంటలో ఉన్న సాయితేజ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ, ఉప్పర్‌పల్లిలోని ఎక్సెలెన్సియా జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, పరీక్షల నిర్వహణ విధానాన్ని సమీక్షించారు.ఈ సందర్భంగా పరీక్షా గదులను సందర్శించి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. పరీక్షలు ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, ఫ్యాన్లు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.పరీక్షా కేంద్రంలో హాజరైన విద్యార్థుల సంఖ్య, గైర్హాజరు వివరాలను సేకరించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, డిస్‌ప్లే రూమ్ ద్వారా ప్రతి గదిని పరిశీలించారు. ప్రశ్నా పత్రాలు నిర్ణీత సమయానికే తెరిచారా, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి ఇచ్చారా వంటి అంశాలపై కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు.ఈ పర్యటనలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్, శామీర్‌పేట్ తహసీల్దారు సుచరిత తదితరులు పాల్గొన్నారు.




## టిపియూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

జఫర్గడ్, ఫిబ్రవరి25,(తెలంగాణ ముచ్చట్లు): మండలం లోని కూనూర్ జడ్పీ హెచ్ఎస్ లో బుధవారం టిపియూఎస్ సంఘం బాధ్యుల ఆద్వర్యంలో క్యాలెండర్ మరియు డైరీ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కూనూర్ కాంప్లెక్ హెచ్. ఎం పర్వేజ్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం సతీష్ కుమార్, జిల్లా కార్యదర్శి పాము సదాశివరావు, కాంప్లెక్స్ మ్యాథ్స్ ఉపాధ్యాయులు అయిత కృష్ణమోహన్, మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో జీవనగమనం పుస్తక ఆవిష్కరణ

వనపర్తి,ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):



వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పాఠశాలలో 'జీవనగమనం' కవితా సంకలన పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. తెలుగు ఉపాధ్యాయులు కీర్తిశేషులు శేఖర్ రచించిన కవితలను ఆయన అర్ధాంగి శ్రీమతి హెప్సిబా సంకలన రూపంలో తీసుకొచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కవితలు, కథలు రాసే నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు పెంపొందించాలని సూచించారు. బాలసాహిత్యంపై ఆసక్తి కల్పించి, విద్యార్థుల రచనలను పుస్తక రూపంలో తీసుకురావాలని కోరారు.సభాధ్యక్షులు జనజ్వాల మాట్లాడుతూ.. సమ సమాజ నిర్మాణానికి దోహదపడేదే నిజమైన కవిత్వమని పేర్కొన్నారు.శేఖర్ ఆలోచనలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. సంపాదకులుగా డాక్టర్ కంటే నిరంజనయ్య కృషి చేసి మూడు నెలల్లో పుస్తకాన్ని తీసుకురావడం విశేషమన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల శివాజీ మాట్లాడుతూ.. విద్యార్థులు కవితా, కథా పుస్తకాలు చదవడం ద్వారా రచనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సాహిత్య కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. సాహిత్యం ప్రజాపక్షంగా ఉండి సమాజాన్ని మేల్కొల్పేదిగా ఉండాలని అన్నారు. సాహితీవేత్త కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. బాలల సాహిత్యం దేశానికి మలుపు కావాలని ఆకాంక్షించారు.రిటైర్డ్ ఎంఈఓ బత్తుల శ్రీనివాసులు మాట్లాడుతూ.. సాహిత్యం ప్రజా చైతన్యానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. జై భీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రతిబింబించేదే నిజమైన సాహిత్యమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ పుస్తక సమీక్ష నిర్వహించి సభికులను అలరించారు. పుస్తకంలోని సామాజిక, రాజకీయ, విద్యా అంశాలపై కవితలు ఉన్నాయని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని, ప్రధానోపాధ్యాయులు ఆకుల శివాజీ, జనజ్వాల, రాజారాం ప్రకాష్, పలుస శంకర్ గౌడ్, డాక్టర్ బండారు శ్రీనివాస్, గణేష్, చంద్రశేఖర్, బౌద్ధారెడ్డి, రవీందర్ గౌడ్, రవి ప్రసాద్ గౌడ్, మహిపాల్ రెడ్డి, వరప్రసాదరావు, కిరణ్ కుమార్, హెప్సిబా, డాక్టర్ కంటే నిరంజనయ్య, గంధం నాగరాజు, బత్తుల శ్రీనివాసులు తదితరులు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం 2025–26కు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 25: (తెలంగాణ ముచ్చట్లు)

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రేరణతో, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం 2025-26 నిర్వహించబడుతోంది.

ఈ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ అసెంబ్లీ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, హాకీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు జరగనున్నాయి. ఎల్కతుర్తి మండలం నుండి ఈ క్రీడలలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ లోపు తమ జట్ల వివరాలను అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎల్కతుర్తి మండలం తరఫున నమోదులను సమన్వయం చేస్తున్న మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందుతాయని తెలిపారు.




నమోదు చేసుకున్న జట్లకు ఈ నెల 28న చీటి ద్వారా జట్ల క్రమాన్ని నిర్ణయించి, మార్చి 1 నుండి 3 వరకు హుస్నాబాద్ ప్రభుత్వ క్రీడా మైదానంలో అసెంబ్లీ స్థాయి పోటీలు నిర్వహించబడతాయి. ఇందులో మొదటి మరియు రెండవ స్థానాలలో నిలిచిన జట్లు పార్లమెంటు స్థాయి పోటీలకు ఎంపిక చేయబడతాయి. ఆ పోటీలు మార్చి 5 నుండి 7 వరకు నిర్వహించబడతాయి.

పార్లమెంటు స్థాయిలో విజేతలైన మొదటి మరియు రెండవ జట్లకు మార్చి 8న బండి సంజయ్ కుమార్ గారి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు మరియు బహుమతులు అందజేయబడతాయి.

ఈ పోటీలకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, వయస్సుకు పరిమితి లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

నమోదు కోసం సంప్రదించవలసిన వారు:
మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ - 9704646902
చదిరం రాకేష్ - 9866126897
ఎం. తిరుపతి - 9381130846

క్రీడాప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఈసీఐఎల్ చౌరస్తాలో 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్–2026' ఫేజ్–2 నిర్వహణ

కుషాయిగూడ, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించాలనే ఉద్దేశంతో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా వద్ద "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026" (ఫేజ్-2) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ డివిజన్ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి హాజరై వాహనదారులకు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలు, కుటుంబాలపై పడే ప్రభావం, చట్టపరమైన చర్యలు మరియు ప్రాణనష్టం వంటి అంశాలను నొక్కి చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారి తీస్తుందని హెచ్చరించారు.కుషాయిగూడ పీఎస్ ఎస్‌హెచ్ఓ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్సైలు ఎన్. సుధాకర్ రెడ్డి, ఎన్. వెంకన్న, సిహెచ్. సాయిలు, ఎం. విజయ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.సుమారు 50-60 మంది వాహనదారులు, స్థానికులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.ఫిబ్రవరి 22 నుండి 28 వరకు ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో అవగాహన ర్యాలీలు, ప్రత్యేక తనిఖీలు, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు."సురక్షితంగా ప్రయాణించండి - సురక్షితంగా గమ్యానికి చేరుకోండి" అనే సందేశంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

## మేఘన్న అభయ హస్తం - బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దమందడి,ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):

పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్రబాలయ్య (తండ్రి: ఎరన్న) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కుటుంబానికి నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తరపున పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిర్వహణకు రూ.5,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, మాజీ సర్పంచ్ సిద్దయ్య, మాజీ ఎంపిటిసి ఇందిరా లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు నరేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



## నాగవరం ఉన్నత పాఠశాలలో 'ఆర్ట్ ఆఫ్ ఆన్సరింగ్' పై మోటివేషన్ కార్యక్రమం

నాగవరం, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

నాగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రేరేపించే లక్ష్యంతో "ఆర్ట్ ఆఫ్ ఆన్సరింగ్" అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సి. రాములు జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభించారు.ముఖ్య అతిథిగా హాజరైన భారత దేశ గ్రాఫాలజిస్ట్ డా. వై. మల్లికార్జున రావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చేతివ్రాతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.సమాధానాలను స్పష్టంగా, శుభ్రంగా రాయడం వల్ల మూల్యాంకనంలో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల సమయంలో సమయపాలన, సమాధానాల నిర్మాణం, ముఖ్యాంశాలను హైలైట్ చేయడం వంటి మెళకువలను పాటించాలని వివరించారు.తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి యూకే విశ్వవిద్యాలయంలో గ్రాఫాలజీ అభ్యసించి ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్ణయించుకుని దానికి అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. కఠినమైన విషయాలను ముందుగా ఆసక్తితో చదవాలని, ఏ విషయాన్నైనా ఏకాగ్రతతో మూడు సార్లు చదివితే సులభంగా గుర్తుంచుకోవచ్చని చెప్పారు.గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం ద్వారా మాత్రమే విజయ పథంలో ముందుకు సాగవచ్చని విద్యార్థులకు ప్రేరణ ఇచ్చారు. "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని సందేశం అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, శ్రీదేవి, వరమ్మ, ఏ. సంధ్యారాణి, కమల, రమా సత్యశ్రీ, గాయత్రి, సంజయ్ రాణి, సుప్రజ, స్వప్న, శ్రీవిద్య, అల్క, పావని, పవిత్రలు పాల్గొన్నారు.









# అగ్రకుల కులోన్మాదం అరికట్టకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది

- బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్

హైదరాబాద్,ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్రంలో కులోన్మాదం అంచలంచెలుగా పెరుగుతోందని, దీనిని తక్షణమే అరికట్టకపోతే రాష్ట్రం బహుజనుల చేతిలో అగ్నిగుండంగా మారే పరిస్థితులు ఏర్పడతాయని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకుల దాడిలో మృతి చెందిన చిన్నారి మౌనికకు నివాళిగా ఎల్బీనగర్ చౌరస్తాలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మాదిగ యువజన సంయుక్త చర్యా సమితి రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ జన జాతికిపురం అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, జై భారత్ రాష్ట్ర కన్వీనర్ ముప్పారం ప్రకాష్, రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు అలిగే జీవన్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బోరెల్లి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే అగ్రకుల అహంకారంతో రజకులపై జరిగిన దాడి అత్యంత దుర్ఘటనగా అభివర్ణించారు. ఈ ఘటనను దేశవ్యాప్తంగా తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి తక్షణం కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆలయ నిర్వహణ బాధ్యతలు రజక కుటుంబానికి అప్పగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన మహాశక్తి రాష్ట్ర అధ్యక్షుడు చందర్ నాయక్, ఆర్పి పార్టీ రాష్ట్ర నాయకుడు అలిగే జీవన్, కాంగ్రెస్ నాయకులు బాలన్న, దేవని శేఖర్, బాలస్వామి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు రైతులు దరఖాస్తు చేసుకోండి

- వైరా మండల వ్యవసాయ అధికారి మాయన్ మంజు ఖాన్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)



సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు రైతులు దరఖాస్తు చేసుకోండి, మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకానిజషన్ పథకం కింద సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తుందని, అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మాయన్ మంజు ఖాన్ తెలిపారు, ఈ పథకంలో సీడ్ కం పెట్టి డ్రిల్ 03, పవర్ విడర్ 04, కల్టివేటర్స్ ఎంబి ప్లావ్, కేజీ వీల్స్ రోటోపట్లర్, 56, బ్రష్ కట్టర్ ఒకటి, స్ట్రాబెల్లర్ 2, మీది సెల్లర్ ఒకటి, పథకంలో ఉన్నవి, ఎస్సీ ఎస్టీ చిన్న సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీపై ఇతరులకు 40 శాతం సబ్సిడీపై అందజేస్తామని అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు, పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్, దరఖాస్తు ఫారం, పాస్ ఫోటో, ట్రాక్టర్ ఆర్ సి, ఐదు సెట్లు తీసుకొని దరఖాస్తు చేయాలని మార్చి రెండో తారీకు వరకు వైరా వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు.



# ఎన్ఎం ఎంఎస్, స్కాలర్షిప్ సాధించిన దేవరకొండ యశ్వంత్..

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)

ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్ ఎం ఎస్ స్కాలర్షిప్ ఫలితాల లో గరికపాడు ఎనిమిదవ తరగతివిద్యార్థి దేవరకొండ యశ్వంత్, ఎంపికయ్యారు, పాఠశాలప్రధానోపాధ్యాయులు డి సత్యనారాయణ, జి యాకోబ్, సహ విద్యార్థులు సర్పంచ్ లక్కిరెడ్డి నాగల క్ష్మి, పాఠశాల చైర్మన్ గంగాదేవిల తిరుపతమ్మ గ్రామస్తులు, యశ్వంత్ ను అభినందించారు.



# వైరా ఎసిపి సారంగపాణిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య నాయకులు...

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)

వైరా ఏసిపి సారంగపాణిని వైరా ఆర్య వైశ్య నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు... ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణమండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి , ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మొదటి ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, ఆర్య సంఘం జిల్లా నాయకులు గజ్జల కృష్ణమూర్తి , నూకల ప్రసాదరావు ,వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లికిరణ్ కుమార్ సెక్రెటరీ కొల్లా రాంబాబు, గజ్జల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను విస్మరించినందుకే కేసీఆర్ ఫామ్ హౌస్‌కు పరిమితం

**ఉద్యమకారుల సంక్షేమానికి పెద్దపీట వేసిన రేవంత్ రెడ్డి ఇంకా పదేళ్లు సిఎంగా కొనసాగుతారు**

**– తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి**

హైదరాబాద్,ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది చేసిన త్యాగాలను పక్కనబెట్టి, కుటుంబ ఆధారిత రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు పాలనలో భాగస్వామ్యం కల్పించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు.

కల్వకుంట్ల కవితకు మాత్రమే ప్రాధాన్యం దక్కిందని, సాధారణ ఉద్యమకారులకు సముచిత స్థానం లభించలేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ విధానాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రస్తుత ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పిడమర్తి రవి పేర్కొన్నారు. స్వరాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని మంత్రిమండలి ప్రకటించడం, హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం, అలాగే ఉద్యమకారులకు పింఛన్ మంజూరు చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇదే విధంగా కృషి చేస్తే రేవంత్ రెడ్డి మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎండి రహీం, డాక్టర్ బోమ్మెర స్టాలిన్, చిరుమర్తి రాజు, డాక్టర్ మీసాల మల్లేష్, బోరెల్లి సురేష్, చింతమల్ల శోభన్ బాబు, సైదాబాద్ గణేష్, ఆంజనేయులు, కంపాటి వెంకట్ గౌడ్, దేవరకొండ నరేష్, నక్క మహేష్, జోగు గణేష్, ఆరెకంటి శ్రీకాంత్, చాగంటి శేఖర్, ఓంకార్, రాజు యాదవ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ తేళ్ళూరి స్రవంతిని సన్మానించిన కుటుంబ సభ్యులు..

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండల పరిధిలోని కొండ వనమాల గ్రామ సర్పంచిగా ఇటీవల ఎన్నికైన తేల్లూరి స్రవంతిని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు వైరాలోని నందిగామ యలమంద స్వగృహంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు... విద్యావంతురాలైన తేల్లూరి స్రవంతి సర్పంచ్ గా ఎన్నికకావటం గర్వంగా ఉందని... గ్రామానికి మంచి పరిపాలన అందించాలని.. మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని వారు ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో నందిగామ ఎలమంద అన్నమ్మ దంపతులు, పాస్టర్ తేళ్ళూరి ప్రసాద్, మేరీ రత్నకుమారి, వేల్పుల రాజారావు, భవాని,నందిగామ మనోహర్, నందిగామ కిరణ్ కుమార్, నందిగామ ప్రేమ్ కుమార్, దయామని, నాగలక్ష్మి, కళ్యాణి, కారుమంచి సుదర్శనం, విక్టోరియా, కారుమంచి నీలమ్మ, బాలమర్తి నగేష్, ధనలక్ష్మి, కోటా రమా, దోర్నాల బాబు విజయలక్ష్మి, తెళ్లూరి ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు..



# వెలుగుమట్ల భూదాన్ భూములపై చర్యలు పూర్తిగా చట్టబద్ధం..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రూ. 250 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి రక్షణ
- వెలుగుమట్ల భూదాన్ భూములపై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -25(తెలంగాణ ముచ్చట్లు)

వెలుగుమట్ల గ్రామ సర్వే నం. 147, 148, 149 లోని భూదాన్ భూములపై జిల్లా యంత్రాంగం చేపట్టిన కూల్చివేతలు, స్వాధీనం చర్యలు పూర్తిగా చట్టబద్ధమైన వని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 ఎకరాల 7 గుంటల భూదాన్ భూమి ఆక్రమణలో ఉండగా, సంబంధిత భూమి మొత్తం విలువ సుమారు 250 కోట్లకు పైగా ఉంటుందని, భూదాన్ బోర్డు భూమిని సిసిఎల్ఏ, హై కోర్ట్ ఆదేశాల మేరకు ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకోవడం ద్వారా భారీ స్థాయిలో ఆస్తిని రక్షించగలిగామని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 24 నాడు నిర్వహించిన కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు దానిని తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగు చూశాయని, ఇప్పటికే పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.



హైకోర్టు స్టే ఉన్న నిర్మాణాలను మినహాయించి మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని భవిష్యత్ ప్రజా అవసరాలకు ఉపయోగిస్తామని, ఇండ్లు కోల్పోయిన వారిలో అర్హులైన స్థానిక పేదలకు ప్రభుత్వం తగు విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.





# ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం...

–జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -25(తెలంగాణ ముచ్చట్లు)

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్, గాంధీచౌక్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రం నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తూ, విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగునీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ ధైర్యం చెప్పారు. పరీక్ష సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, బాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 18 వేల 258 మంది హాజరు కావాల్సి ఉండగా, పరీక్షకు 17 వేల 667 మంది హాజరు కాగా, 591 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రం తనిఖీ సమయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# వల్లభాపూర్‌లో కల్లు గీత సంఘం ఎన్నికలు విజయవంతం

ఎల్కతుర్తి. ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

హన్మకొండ జిల్లా, ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామంలో కల్లు గీత సహకార సంఘం ఎన్నికలు శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం భవనంలో ఎన్నికల అధికారి రావుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా చిర్ర చక్రపాణి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చిర్ర రవీందర్ గౌడ్, క్యాషియర్‌గా మామిడి సారంగపాణి గౌడ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు అభినందిస్తూ సంఘ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.

సంఘ బలోపేతం, కార్మికుల సంక్షేమం, పారిశ్రామిక పురోగతి దిశగా సమిష్టిగా పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళను సన్మానించిన నంబూరి రామారావు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)


వైరా మున్సిపాలిటీ నూతన చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కాపా చంద్రకళ డాక్టర్ కాపా మురళీకృష్ణను వైరా దాల్మిల్ అసోసియేషన్ సభ్యులు లయన్ నంబూరు రామారావు మురళీ కృష్ణ హాస్పిటల్ నందు ఘనంగా సన్మానించారు వీరితో పాటుగా 20 వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి 2వార్డ్ కౌన్సిలర్ తిరుపతి శివకుమారి 5 వార్డ్ కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీతను ఘనంగా సన్మానించారు అనంతరం మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు రీజన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్రావు కొల్లా రాంబాబు కట్ల సురేష్ తాటి కొండ రాము నూకల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గొల్లగూడెం మదర్సాలో ఖత్మే ఖురాన్ వేడుక

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు)



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగర శివారు గొల్లగూడెం లోని ఇదారా తాలిముల్ ఇస్లాం ట్రస్ట్ లో తొమ్మిది రోజులపాటు జరిగిన ప్రత్యేక తరావిహ్ నమాజులో ఖురాన్ పఠణం పూర్తయిన సందర్భంగా గురువారం మదర్సాలో ఖత్మే ఖురాన్ వేడుక జరుగుతుందని నిర్వాహకులు ముఫ్తి అబ్దుల్ రవుఫ్ ఖాన్ ఖాస్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకను పురస్కరించుకుని గురువారం సాయంత్రం మదర్సా ప్రాంగణంలో ఇఫ్తార్ విందు కూడా జరుగుతుందని, ఈ విందుకు ముస్లిం సోదరులు తమ కుటుంబ సభ్యులతో పాటు హాజరుకావాలని ఆయన కోరారు. విందు అనంతరం ఖత్మే ఖురాన్ వేడుక, తదుపరి ప్రత్యేక దువా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ఖత్మే ఖురాన్ వేడుకను జయప్రదం చేయాలని ముఫ్తి అబ్దుల్ రవూఫ్ ఖాన్ కోరారు.




## గీటురాయి వారపత్రిక ముద్రించిన రమజాన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ఖమ్మం బ్యూరో , ఫిబ్రవరి 25(తెలంగాణ ముచ్చట్లు)

రమజాన్ ఉపవాసాల పరమార్థమేమిటి? సహెరీ, ఇఫ్తార్ శుభాల సంగతులు, రమజాన్ మనలో ఎలాంటి మార్పు కోరుతుంది తదితర విశేషాల సమాహారంతో గీటురాయి వారపత్రిక ముద్రించిన రమజాన్ ప్రత్యక సంచికను జమాఅతె ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్ , సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, ఖమ్మం పట్టణంలో ఇంద్ర నగర్ గల జమాఅతె ఇస్లామీ హింద్ కార్యాలయంలో రమజాన్ ప్రత్యక సంచిక ఆవిష్కరించారు అనంతరం జైనుల్ పాషా మాట్లాడుతూ రమజాన్ ఉపవాసాలు మనిషిలో ఎలాంటి మార్పు తీసుకొస్తాయో ఇందులోని వ్యాసాలు చక్కటి స్ఫూర్తినింపుతాయని ఆయన అన్నారు. రోజాలు, తరావీహ్ నమాజులు, ఖుర్ఆన్ పారాయణం చేస్తూ రమజాన్ నెల రోజులను ముస్లిములు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ముస్లిములకు పిలుపునిచ్చారు. జకాత్ పేదల హక్కు అని స్థితిమంతులు తమ సంపదలోనుంచి జకాత్ దానాన్ని నిరుపేదలకు పంచాలని ఆయన కోరారు. ఇస్లామ్ పట్ల అపోహలు, అపార్థాలను తొలగించి నాలుగు దశాబ్దాలుగా గీటురాయి పత్రిక భిన్న వర్గాలకు వారధిగా నిలుస్తోందని ఆయన అన్నారు. ఈ పత్రికను ప్రజల్లోకి తీసుకెళ్లి రమజాన్ విశిష్టత గురించి తెలియజేయాలని ఆయన చెప్పారు. పవిత్ర రమజాన్ నెల విశిష్టతపై రచయితలు చేసిన విశ్లేషణలు చక్కని అవగాహన కల్పిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమములో కార్యకర్తలు ఫయాజ్, కబీర్ ఖాన్, సలీం, జీలాని ,అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జనసేన క్రియాశీలక సభ్యత్వాలు ప్రారంభం

కామారెడ్డి,ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):



జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు దేశవ్యాప్తంగా రేపటి నుంచి ప్రారంభం కానున్నాయని పార్టీ కామారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు జాజారి దినేష్ తెలిపారు. జిల్లాలోని జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.400 రూపాయలతో క్రియాశీలక సభ్యత్వం పొందవచ్చని, ఈ సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి గ్రామం, మండల స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఎంపి కడియం కావ్యకు అరుదైన గౌరవం

### వరంగల్ ఎంపీ డా. కడియం కావ్యకు అంతర్జాతీయ పార్లమెంటరీ బాధ్యత



వరంగల్,ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కు అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా-సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా ఆమెను లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ విభాగం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.
భారతదేశం-సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడం లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. రెండు దేశాల పార్లమెంటరీ ప్రతినిధుల మధ్య పరస్పర అవగాహన, సహకారం పెంపొందించేందుకు ఈ వేదిక కీలకంగా మారనుంది.
ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భారత్-సౌదీ అరేబియా సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ నామినేషన్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి గర్వ కారణమని, అంతర్జాతీయ వేదికపై తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకురావడంలో ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.







# మీ భద్రతే మా లక్ష్యం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 25(తెలంగాణ ముచ్చట్లు)

మీ భద్రత మా లక్ష్యం మని,భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ,పోలీస్ శాఖ నిర్వహిస్తున్న "అరైవ్ ఆలైవ్" రెండోవ విడత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ హెడ్ క్వాటర్స్ లోని పోలీస్ కళ్యాణ మండపంలో బుధవారం ఆటో డ్రైవర్ల అవగాహన కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ హాజరై రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..రోడ్డు భద్రత నియమాలపైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయన్నారు.
నిర్ణీత వేగ పరిమితిని పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని అన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం, ఓవర్ టేక్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. "సురక్షిత ప్రయాణం - సంతోషకర గమ్యం" అనే లక్ష్యంతో అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, సమాజం మొత్తంగా ముందుకు వస్తేనే ప్రమాదాలను తగ్గించగలమని అన్నారు. 'అరైవ్ అలైవ్' ఒక ఉద్యమంగా మారాలి ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక అవగాహన కార్యక్రమంగా కాకుండా, ప్రజా ఉద్యమంగా మార్చాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులను కూడా ప్రోత్సహిస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, అప్పలనాయుడు, ఎస్సై లు పాల్గొన్నారు.






# విద్యార్థులు కష్టపడి చదవాలి

- విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ
- ఆకట్టుకున్న విద్యార్థుల విద్యాబోధన
- గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా స్వయంపాలన దినోత్సవం

స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):

ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల స్టేషన్ ఘనపూర్‌లో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక రోజు పాటు విద్యార్థినులే ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలు బోధించి అందరినీ ఆకట్టుకున్నారు. తమ దైన శైలిలో పాఠ్యాంశాలను వివరించి సహ విద్యార్థినులకు సులభంగా అర్థమయ్యేలా బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు ఉపాధ్యాయుల మాదిరిగా సన్నద్ధమై తరగతి గదుల్లో బోధన నిర్వహించడం అభినందనీయం అని పేర్కొన్నారు. బోధనలో వివిధ శిక్షణా సాధనాలను వినియోగించడం ద్వారా పాఠ్యాంశాలను సమర్థంగా అందించారని తెలిపారు. విద్యార్థి ఉపాధ్యాయుల బోధనను ఉపాధ్యాయులు పరిశీలించడం ద్వారా వారికి బాధ్యతలపై అవగాహన కలిగిందన్నారు. ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం ద్వారా ఉపాధ్యాయ వృత్తి గొప్పతనం, బాధ్యతలు తెలిసి భవిష్యత్తులో ఆ దిశగా ముందుకు సాగేందుకు ఇది దోహదపడుతుందని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకొని కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. సమాజంలోని అన్ని వృత్తులకు పునాది వేయగల వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు వివిధ పదవులను స్వీకరించి బాధ్యతలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బి. వాసు, పార్వతి బాయి, బి. దశరథ్, సుమలత, బి. చంద్రం, పద్మ, మాన్య, మల్లు, వీరన్న, సుజాత, కల్పన, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# ములుగులో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు

ములుగు,ఫిబ్రవరి25(తెలంగాణ ముచ్చట్లు):



ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ వద్ద గోర్ బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ ఆలయానికి కేటాయించిన స్థలంలో బాల బ్రహ్మచారి కిషన్ మహారాజ్ చేతుల మీదుగా భోగ్ భండారో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ హాజరై మాట్లాడారు. సేవాలాల్ మహారాజ్ సూచించిన మార్గంలో నడుచుకుంటూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. తమ హయాంలో ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించడం సంతోషకరమని పేర్కొన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని, వచ్చే 288వ జయంతి నాటికి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.
కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, కన్వీనర్ పోరిక రాహుల్ నాయక్, గోవింద్ నాయక్, ధర్మ నాయక్, దబ్బకట్ల జనార్ధన్, బంజారా కౌన్సిలర్లు ఆలోత్ పద్మ దేవ్ సింగ్, పోరిక రాజు నాయక్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. సాదు సంతులు రమేష్ గిరి మహారాజ్, విఠల్ మహారాజ్, గోర్ సిక్వాడి హసాబి హట్యా నాయక్, కిషన్ నాయక్, బాలు నాయక్, గోర్ సేన ములుగు జిల్లా అధ్యక్షుడు పోరిక రాజ్ కుమార్ నాయక్, బంజారా సంఘ నాయకులు పోరిక మోహన్ లాల్, సునీల్, సర్వణ్, రాజు, వినాయక్, కిషన్, దేవీలాల్, సమ్మయ్య, జవహర్ లాల్, జయరాం తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.భక్తుల హర్షధ్వానాల మధ్య జయంతి వేడుకలు భక్తి వాతావరణంలో ముగిశాయి.



## అంగన్వాడీ కేంద్రాలు తనిఖీ చేసిన సర్పంచ్ అన్నం స్వప్నబ్రహ్మారెడ్డి

జఫర్గడ్, ఫిబ్రవరి25,(తెలంగాణ ముచ్చట్లు): మండలం లోని తమ్మడపల్లి జి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను బుధవారం స్థానిక సర్పంచ్ అన్నం స్వప్నబ్రహ్మారెడ్డి తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణీలకు పంపిణి చేస్తున్న గుడ్లు, పాలు మరియు బాలామృతాన్ని పరిశీలించారు. అలాగే మంచి పౌష్టిక ఆహారాన్ని ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వారితో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు

## లైంగిక వేధింపుల ఆరోపణలు... మహిళపై ఇనుప రాడుతో దాడి

**వేలేరు, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో మహిళపై దాడి ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన మాలోతు హరిత (33), భర్త రాజు, అదే గ్రామానికి చెందిన దారవత్ రాజకుమార్ (30) అనే ట్రాక్టర్ డ్రైవర్ గత కొంతకాలంగా తనను లైంగికంగా వేధిస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది. పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదని పేర్కొంది. కోరిక తీర్చలేదన్న ఆగ్రహంతో కిరాణా దుకాణంలో పని చేస్తున్న సమయంలో హరితపై రాజకుమార్ ఇనుప రాడుతో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో ఆమె తలకు గాయాలు కావడంతో వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వేలేరు ఎస్సై అజ్మీర సురేష్ తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# ప్రమాదాల నియంత్రణకు
# రోడ్డు సేఫ్టీ అందరి బాధ్యత...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -25(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపట్టిన పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి, స్పష్టమైన మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డాటాబేస్ ఆధారంగా జిల్లాలో గుర్తించిన ముఖ్యమైన 30 ప్రమాద ప్రాంతాలలో చేపట్టిన రోడ్డు భద్రతా పనులలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ లోని వెంకటగిరి క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్, వరంగల్ క్రాస్ రోడ్డు, ఏదులాపురం జంక్షన్ ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రోడ్డు భద్రతా పనులను పరిశీలించారు.

అనంతరం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు, కొత్త బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, బల్లేపల్లి సెంటర్, రఘునాథపాలెం ఆపిల్ సర్కిల్ ప్రాంతాలలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి రోడ్డు భద్రతా పురోగతి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రోడ్డు భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే అవకాశమున్న 30 బ్లాక్ స్పాట్స్‌ను శాస్త్రీయంగా గుర్తించి, అక్కడ స్పీడ్ కంట్రోల్ చర్యలు చేపట్టామని తెలిపారు. రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు, పాదచారుల మార్గాలు, రోడ్ స్టడ్స్, క్యాట్ ఐస్, సోలార్ బ్లింకర్స్, క్రాష్ బారియర్స్, థర్మోప్లాస్టిక్ లైన్ మార్కింగ్ వంటి భద్రతా చర్యలను సమగ్రంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్డుపై "గో స్లో" వైట్ పేయింట్ వేయడం, స్కూల్ జోన్‌ల వద్ద ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, స్పీడ్ బ్రేకర్లు సరిగ్గా నిర్మించడం వంటి చర్యలు ప్రజల్లో అప్రమత్తత పెంచుతాయని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డిటెక్షన్ సెంటర్ (ఐఆర్ఏడి) డేటాను సమీక్షించి, ప్రమాదాల ప్రధాన కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే 15 రోజుల్లోనే మార్పు కనిపించేలా అధికారులు పనిచేయాలన్నారు. పనులు పూర్తి చేయడమే కాదు, నాణ్యతను కూడా నిర్ధారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నగర పరిధిలో నూతన రహదారుల నిర్మాణంలో డ్రైనేజీ వ్యవస్థను తప్పనిసరిగా కల్పించాలని, అవసరమైన ప్రాంతాలలో పుట్ పాత్ ల నిర్మాణం చేపట్టాలని, వర్షా కాలంలో రోడ్లు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, నూతన పాలక వర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమైనది అన్నారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకపోవడం, యువత స్పీడ్‌పై నియంత్రణ ఉండకపోవడం వలన డ్రైవింగ్ సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రోడ్డు భద్రత ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం తో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రంలో ఆర్ అండ్ బి ఎస్.ఈ. యాకోబ్, పబ్లిక్ హెల్త్ ఇ ఇ రంజిత్, నేషనల్ హైవే పిడి దివ్య, ఈఈ యుగంధర్, ఎదులాపురం మున్సిపల్ కమీషనర్ మున్వర్ అలీ, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగలి నీడలో పెరిగిన జీవితం...



నల్ల రేగడి శెలకలో
ఒక్కడే నాగలి పట్టుకుని
మట్టితో మాట్లాడుతూ
తన జీవితాన్ని
పంటలా మలిచాడు మా నాయన.

ఎండ నెత్తిన నిప్పలా కూర్చుంటే
మా నాయన పెయ్యి నల్లగా
మెరుస్తూ
మట్టితో ఒకే రంగు అయిపోయేది,
ఆకాశానికే తెలియని
ఒక నిశ్శబ్ద కూలీలా.

చేనులో తుమ్మ చెట్టు, యాప చెట్టు
చల్లని గాలి తాకినప్పడల్లా
ఆ గాలిలో
అమ్మ ప్రేమనే ఊపిరిగా పీల్చేవాడు
మా నాయనా.

అమ్మ తెచ్చిన జొన్న రొట్టె,
మామిడికాయ తొక్కు సద్ది
అది భోజనం కాదు,
ఆ రోజు బతికినట్టు
భూమితో చేసుకున్న ఒప్పందం.

ప్రపంచం ట్రాక్టర్ మీద
కాలాన్ని ఎక్కించుకుని
పరుగెడుతుంటే,
మా నాయన మాత్రం
ఎద్దుల నడకలోనే
ఋతువుల్ని లెక్కపెట్టేవాడు.

మిషన్లకు అలవాటైన ఈ
యుగంలో
నాగలి పట్టుకున్న చేతులు
పాతవి కాదు
అవి భూమికి ఇంకా
మనిషి ఉన్నాడని చెప్పే
చివరి అక్షరాలు.

నల్ల మట్టిలో కలిసిపోయిన
మా నాయన అడుగుజాడలు,
ఈరోజు కూడా చెప్తున్నాయి
"అభివృద్ధి అంటే వేగం కాదు,
వేర్లు వదలకుండా నిలబడటమే"
అని.

నాగలి పట్టుకున్న ఆ చేతులే
నా కథ,
నా గౌరవం,
నా మొదటి ప్రార్థన.

**- బసడ సంపత్ యాదవ్**



## ద్విచక్ర వాహనాల్లో టాప్‌లో ఈ మోడళ్లు

**న్యూఢిల్లీ – ఫిబ్రవరి 25 – తెలంగాణ ముచ్చట్లు:** దేశీయ ద్విచక్ర వాహన రంగం జనవరి నెలలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. కమ్యూటర్ విభాగంలో పెరిగిన డిమాండ్‌తో ప్రముఖ కంపెనీల మోడళ్లు భారీగా అమ్ముడయ్యాయి. టాప్ పది మోడళ్ల కలిపి అమ్మకాలు తొమ్మిది లక్షల రెండు వేల తొంభై ఆరు యూనిట్లకు చేరుకోగా, గత సంవత్సరం ఇదే నెలలో నమోదైన ఏడున్నర లక్షల యూనిట్లతో పోలిస్తే ఇరవై శాతం కంటే ఎక్కువ వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఇంధన మైలేజ్, తక్కువ నిర్వహణ ఖర్చు, అందుబాటు ధర వంటి అంశాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. అమ్మకాల జాబితాలో మొదటి స్థానంలో హీరో స్ప్లెండర్ నిలిచింది. జనవరి నెలలో మాత్రమే మూడు లక్షల ఇరవై నాలుగు వేల పందొమ్మిది యూనిట్లు అమ్ముడై సుమారు ఇరవై ఐదు శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశంలో అత్యధికంగా కొనుగోలు చేసిన మోటార్ సైకిల్‌గా ఇది మళ్లీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. రెండో స్థానంలో హోండా షైన్ నిలిచింది. ఈ మోడల్ ఒక లక్ష అరవై ఒక వేల రెండువందల ఇరవై నాలుగు యూనిట్లు అమ్ముడైంది. గత సంవత్సరం సంఖ్యలతో పోలిస్తే స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, స్థిరమైన డిమాండ్‌ను కొనసాగిస్తోంది. మూడో స్థానాన్ని బజాజ్ పల్సర్ దక్కించుకుంది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు ఇరవై నాలుగు శాతం వృద్ధితో ఒక లక్ష ఇరవై తొమ్మిది వేల ఆరు వందల యూనిట్లు అమ్ముడయ్యాయి. యువతలో ఈ మోడల్‌కు ఉన్న ఆదరణ స్పష్టంగా కనిపిస్తోంది. నాలుగో స్థానంలో హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ నిలిచింది. ఇది డెబ్బై ఒక వేల ఆరు వందల తొంభై యూనిట్లు అమ్ముడై పదిహేను శాతం పైగా వృద్ధిని సాధించింది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో సమానంగా డిమాండ్ ఉన్న మోడల్‌గా ఇది నిలుస్తోంది. టాప్ ఐదులో టీవీఎస్ అపాచీ కూడా చోటు దక్కించుకుంది. యాభై ఒక వేల పైగా యూనిట్లు అమ్ముడై దాదాపు నలభై ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసింది. మధ్య తరగతి ప్రీమియం విభాగంలో ఈ మోడల్ మంచి ప్రదర్శన కనబరుస్తోంది.




## ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో మార్మోగిన మోదీ నినాదాలు

**ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడుదాం – ప్రధాని పిలుపు**

**భారత్‌కు నిజమైన స్నేహితుడు ఇజ్రాయెల్ – నరేంద్ర మోదీ**

**వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త దిశ**



**తెల్ అవీవ్, ఫిబ్రవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తొమ్మిదేళ్ల తర్వాత ఇజ్రాయెల్‌లో అడుగు పెట్టిన మోదీకి ఆ దేశం ఘన స్వాగతం పలికింది. తెల్ అవీవ్ విమానాశ్రయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్వయంగా స్వాగతం పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సతీసమేతంగా విమానాశ్రయానికి చేరుకున్న నెతన్యాహు, ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మోదీకి ఆత్మీయ ఆహ్వానం అందించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో మోదీ ప్రసంగం సందర్భంగా సభ చప్పట్లతో మార్మోగింది. "నమస్తే" అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, భారత్-ఇజ్రాయెల్ స్నేహబంధం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. కష్ట కాలంలో ఇజ్రాయెల్ భారత్‌కు అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఉగ్రవాదంపై పోరులో ఇరు దేశాలు భాగస్వాములని తెలిపారు. ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం జరుగుతుండగా సభలోని సభ్యులు "మోదీ.. మోదీ.." అంటూ నినాదాలు చేయడం విశేషంగా నిలిచింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, మోదీ తనకు సోదరుడిలాంటి వారని అన్నారు. భారత్‌తో తమ స్నేహం బలపడుతోందని పేర్కొన్నారు. రక్షణ, వ్యవసాయం, సాంకేతికత, నీటి నిర్వహణ తదితర రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. రెండు దేశాల మధ్య భారీ రక్షణ ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఐరన్ డోమ్ సాంకేతికతపై చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఇజ్రాయెల్ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రెండు రోజుల పర్యటనలో ద్వైపాక్షిక చర్చలు, వ్యూహాత్మక ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్-ఇజ్రాయెల్ స్నేహబంధం మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వారణాసి కోసం నూతన సాంకేతిక వేదిక

తెలుగు చలనచిత్ర పరిశ్రమ సాంకేతిక రంగంలో మరో ముఖ్యమైన ముందడుగు వేసింది. ఇప్పటి వరకు విదేశీ చిత్రాలకు మాత్రమే పరిమితమైన ఆధునిక కదలిక స్వీకరణ సాంకేతిక విధానం ఇప్పుడు హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి వచ్చింది. నగరంలోని ప్రముఖ అన్నపూర్ణ స్టూడియోస్లో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన కదలిక స్వీకరణ ప్రయోగశాలను ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఘనంగా ప్రారంభించారు. ఈ సదుపాయం తెలుగు చిత్ర సీమకు కొత్త అవకాశాలను తెరవనుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు నిర్మాత శోభు యార్లగడ్డకు చెందిన నిర్మాణ సంస్థలు మరియు విదేశీ సాంకేతిక నిపుణుల సహకారంతో ఈ ప్రయోగశాల నిర్మించబడింది. గతంలో భారీ దృశ్య ప్రభావాలు అవసరమైన సందర్భాల్లో చిత్రబృందాలు విదేశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అదే సాంకేతికత హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో సమయం, వ్యయం రెండూ ఆదా కావడంతో పాటు నాణ్యత కూడా మరింత మెరుగుపడనుంది. ప్రయోగశాల ప్రారంభోత్సవం అనంతరం రాజమౌళి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న వారణాసి చిత్రంలోని కొన్ని కీలక దృశ్యాలను ఇప్పటికే ఈ సదుపాయంలో చిత్రీకరించినట్లు తెలిపారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా మహేశ్ బాబు నటిస్తున్న విషయం తెలిసిందే. గతంలో తాను రూపొందించిన ఈగ, బాహుబలి చిత్రాల సమయంలో ఇలాంటి సాంకేతిక వేదిక అందుబాటులో ఉంటే మరింత విస్తృతంగా ప్రయోగాలు చేయగలిగేవారమని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ సదుపాయం భారతీయ చిత్రకారుల ఆలోచనా విధానాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వారణాసి చిత్రానికి సంబంధించిన దృశ్యాల ఫలితాలు అద్భుతంగా వచ్చాయని రాజమౌళి తెలిపారు. భారీ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని చిత్రబృందం వెల్లడించింది. తెలుగు చిత్రసీమ సాంకేతిక రంగంలో సాధించిన ఈ కొత్త మైలురాయి భవిష్యత్తులో మరిన్ని విశిష్ట చిత్రాలకు మార్గం సుగమం చేయనుంది.



# టాలీవుడ్ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఇవానా

తాజా సంచలనంగా నిలిచిన నటి ఇవానా ఇప్పుడు తెలుగు చిత్రసీమలో అవకాశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. బాలనటిగా తన ప్రస్థానం ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ, ఆ తర్వాత కథానాయికగా మారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తమిళ చిత్రంగా విడుదలైన లవ్ టుడే ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ చిత్రం తెలుగులో అనువాద రూపంలో విడుదలై ఇక్కడ కూడా విశేష ఆదరణ పొందింది.

లవ్ టుడే విజయానంతరం ఇవానా చేసిన మరో చిత్రం సింగిల్. ఇందులో హీరోగా నటించిన శ్రీవిష్ణుతో కలిసి ఆమె చూపించిన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. అందం మాత్రమే కాకుండా భావప్రకటనలోనూ తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ విజయాలతో ఇప్పుడు ఆమెకు తెలుగులో మరిన్ని అవకాశాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇవానా తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంది. తాను ఎత్తు తక్కువగా ఉండటంతో పాఠశాల దశలో అనేక విమర్శలు ఎదుర్కొన్నానని, స్నేహితులు తనను 'పొట్టి' అంటూ ఆటపట్టించేవారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు తనకు మానసికంగా బాధ కలిగించాయని, చదువుపై కూడా ప్రభావం చూపాయని వెల్లడించింది. అయితే చిన్న వయసు నుంచే సినిమాలపై ఆసక్తి ఉండేదని, అదే తనను ఈ రంగంలోకి తీసుకువచ్చిందని తెలిపింది. తెలుగులో తనకు ఎంతో ఇష్టమైన చిత్రం హ్యాపీడేస్ అని ఆమె చెప్పింది. ఆ చిత్రంలోని పాటలు తనకు ప్రత్యేకంగా నచ్చుతాయని పేర్కొంది. అలాగే తనకు అభిమాన నటుడిగా అల్లు అర్జున్ పేరు చెప్పింది. ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతున్న ఇవానా, సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులతో మమేకమవుతోంది. త్వరలోనే ఆమె టాలీవుడ్‌లో మరింత బిజీ కథానాయికగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఉదయ్‌పూర్‌లో విజయ్–రష్మికల వివాహం



టాలీవుడ్‌లో అత్యంత ఆదరణ పొందిన జంటగా గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు మరి కొద్ది గంటల్లో వివాహ బంధంతో ఒక్కటవబోతున్నారు. ఎన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట తమ సంబంధాన్ని అధికారికంగా వెల్లడించిన తర్వాత అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఇప్పుడు రాజస్థాన్ రాష్ట్రంలోని అందమైన సరస్సుల నగరం ఉదయ్‌పూర్లో అంగరంగ వైభవంగా ఈ వివాహ వేడుక జరగనుండటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పరిమిత అతిథుల సమక్షంలో అత్యంత గోప్యంగా ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు సమాచారం. సుమారు వందమంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలుస్తోంది.

ఫిబ్రవరి 26న జరగనున్న ఈ వివాహం రెండు భిన్న సంప్రదాయాల ప్రకారం నిర్వహించనున్నారు. విజయ్ దేవరకొండ తెలుగు కుటుంబానికి చెందినవారు కాగా, రష్మిక మందన్న కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లాకు చెందిన కొడవ సమాజానికి చెందారు. అందుకే ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం, సాయంత్రం కొడవ ఆచారాల ప్రకారం వివాహ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొడవ సమాజానికి ప్రత్యేకమైన సంస్కృతి, ఆచార వ్యవహారాలు ఉన్నాయి. వీరి వివాహాన్ని "మంగళ" అని పిలుస్తారు. సాధారణ హిందూ వివాహాల్లో ఉండే అగ్నిప్రదక్షిణలు, సప్తపది వంటి ఆచారాలు ఉండవు. ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేయడం, వరుడు కత్తి ధరించి ఊరేగింపుగా రావడం, అరటి మొక్కలను నరికే ఆచారం ఈ సంస్కృతిలో ప్రత్యేకతగా నిలుస్తాయి.

పెళ్లి రోజు వధువు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక శైలిలో చీర కట్టుకుంటారు. వరుడు నలుపు రంగు కోటు, తలపాగా ధరించడం ఆనవాయితీగా ఉంటుంది. పూర్వీకులకు, ప్రకృతికి, కావేరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించడం కొడవ సంప్రదాయంలో ముఖ్యమైన భాగంగా భావిస్తారు. ఈ రెండు సంప్రదాయాల సమ్మిళితంగా జరిగే వివాహం అరుదైన వేడుకగా నిలవనుంది. వివాహానంతరం మార్చి 4న హైదరాబాద్ నగరంలో ప్రముఖ అతిథుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరుకానున్నారని తెలుస్తోంది. ఎన్నాళ్లుగానో తమ ప్రేమను గోప్యంగా కొనసాగించిన ఈ జంట ఇప్పుడు దంపతులుగా కొత్త జీవితాన్ని ప్రారంభించబోతుండటంతో అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. దేశవ్యాప్తంగా ఈ వివాహ వేడుకపై ఆసక్తి నెలకొంది.

# జాంబిరెడ్డి రెండో భాగం సిద్ధం?




తెలుగు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జాంబిరెడ్డి చిత్రానికి రెండో భాగం రాబోతుందనే వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భయానక అంశాలతో కూడిన వినోదాత్మక కథగా రూపొందిన ఈ చిత్రం విడుదలైనప్పుడు మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ కథకు కొనసాగింపుగా మరో భాగాన్ని రూపొందించేందుకు ప్రయత్నాలు ప్రారంభమైనట్లు సమాచారం. ఈ చిత్రంతో ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రశాంత్ వర్మ, హీరోగా నిలిచిన తేజ సజ్జా జంట మరోసారి కలిసే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈసారి దర్శకత్వ బాధ్యతలను ప్రశాంత్ వర్మ స్వయంగా చేపట్టరని, కథను మాత్రమే అందించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. కొత్త దర్శకుడు ఈ బాధ్యతలు స్వీకరించనున్నాడనే సమాచారం ఆసక్తిని పెంచుతోంది. తేజ సజ్జాతో మరో చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు ఇప్పటికే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సంస్థ అధినేత టి జీ విశ్వప్రసాద్ ఈ ప్రాజెక్టును భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కథా రూపకల్పన, పాత్రల ఎంపిక, ఇతర ప్రాథమిక పనులు జరుగుతున్నట్లు సమాచారం. రెండో భాగంలో భయానక సన్నివేశాలు మరింత ఉత్కంఠభరితంగా ఉండేలా కథను మలుస్తున్నారట. వినోదంతో పాటు ఉత్కంఠను సమపాళ్లలో అందించేలా కథా నిర్మాణం జరుగుతుందని తెలుస్తోంది. మొదటి భాగం యువ ప్రేక్షకులను ఆకట్టుకున్న నేపథ్యంలో, ఈసారి మరింత విస్తృత స్థాయిలో చిత్రాన్ని తీసుకురావాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నారు.

అయితే ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోయే వ్యక్తి ఎవరు అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలపై పూర్తి నిర్ధారణ లేకపోయినా, జాంబిరెడ్డి రెండో భాగం వస్తుందనే సంకేతాలు మాత్రం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in